

# సందీప్‌నగర్ కాలనీలో ఘనంగా హోలీ వేడుకలు

**ప్రజానావ, ఆసిఫాబాద్ టౌన్ :** జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్ కాలనీలో హోలీ పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సంబరాల్లో భారతీయ జనతా పార్టీ ఎస్సీ సెల్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్ పాల్గొని కాలనీవాసులతో కలిసి పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాటూరి జయరాజ్ కాలనీలోని ప్రతి ఒక్కరికీ రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. పరస్పరం రంగులు చల్లుకుంటూ కాలనీవాసులు ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకల్లో నిమగ్నమయ్యారు. అనంతరం జయరాజ్ మాట్లాడుతూ.. రంగుల పండుగ హోలీ సమాజంలో సోదరభావాన్ని, సమైక్యతను పెంచుతుందని ఆకాంక్షించారు.

# జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో హోలీ వేడుకలు



**ప్రజానావ, ఆసిఫాబాద్ టౌన్ :** జిల్లా అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో హోలీ వేడుకలు జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డిఎఫ్ఒ కుటుంబ సభ్యులతో కలిసి, సిబ్బందితో నిర్వహించుకున్న వేడుకల్లో ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండగ ప్రతి కుటుంబంలో సంతోషాలు నింపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు యోగేష్ కులకర్ణి, ఝాన్సీ రాణి, సెక్షన్ అధికారులు మహేందర్, సాయిచరణ్, సతీష్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా హోలీ పండుగ వేడుకలు



**ప్రజానావ, ఆదిలాబాద్:** హోలీ పండుగను పురస్కరించుకుని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు రంగుల హోలీని ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. గ్రామాలు, పట్టణాలు అన్నిచోట్లా ఆనందోత్సాహాల మధ్య హోలీ సంబరాలు కొనసాగాయి. మావల మండల కేంద్రంలోని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి నివాసంలో హోలీ వేడుకలు ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనకు రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు, కాంగ్రెస్ శ్రేణులు సోదరభావం, సామరస్యాన్ని ప్రదర్శిస్తూ పండుగ స్ఫూర్తిని చాటిచెప్పారు. ఈ వేడుకల్లో మావల సర్పంచ్ ధర్మపూరి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ కోతపల్లి స్వప్న అడెల్లు, పరమకుశం వెంకటేష్, భూమేష్, కాడె దినేష్, అంబడి అక్షయ్, తురాటి గంగన్న, అంబడి నరేష్, దొగ్గలి ప్రవీణ్, నవీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# హోలీ కొత్త ఉత్సాహాన్ని నింపాలి



**ప్రజానావ, సత్తుపల్లి:** హోలీ పండగ ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాలని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆకాంక్షించారు. మంగళవారం హోలీ పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ కూడా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. రంగుల పండుగ ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలు ఆనందంగా, సురక్షితంగా హోలీ పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.





# అంగన్‌వాడీల్లో 'విద్యుత్' కాంతులు

**చిన్నారుల భవిష్యత్తుకు సరికొత్త వెలుగులు • ఎస్ఈ ఉత్తమ్ జాడే చొరవ**

సాధారణంగా ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాలంటే మనకు గుర్తుకు వచ్చేది అరకొర వసతులు, ఫ్యాన్లు లేక ఉక్కపోతతో అల్లాడే చిన్నారులు. కానీ, ఇప్పుడు ఆ దృశ్యం మారుతోంది. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసిఎల్ ) తీసుకున్న విప్లవాత్మక నిర్ణయంతో అంగన్‌వాడీ కేంద్రాలు ఆధునిక హంగులను అద్దుకుంటున్నాయి. ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ ఉత్తమ్ జాడే పర్యవేక్షణలో సాగుతున్న ఈ ఉచిత విద్యుదీకరణ ప్రక్రియ సామాజిక మార్పుకు శ్రీకారం చుడుతోంది.

- ప్రజానావ, , ఆసిఫాబాద్



## చీకటి నుంచి వెలుగు వైపు..

గతంలో విద్యుత్ కనెక్షన్ లేక అనేక కేంద్రాల్లో చిన్నారులు వేసవి కాలంలో తీవ్ర ఇబ్బందులు పడేవారు. చిమ్మచీకటి గదుల్లో విద్యాబోధన సాగేది. అయితే, ఇప్పుడు పరిస్థితి మారుతోంది. సర్కిల్ పరిధిలోని 80 కేంద్రాలకు ఇప్పటికే ఉచిత కనెక్షన్లు మంజూరు చేశారు. కేవలం కనెక్షన్ ఇవ్వడమే కాకుండా, లోపల వైరింగ్ పనులను కూడా ఎన్పీడీసీఎల్ ఉచితంగా పూర్తి చేస్తూ చిన్నారుల పట్ల తమకున్న సామాజిక బాధ్యతను చాటుకుంటోంది.

## సకల సౌకర్యాల నిలయాలు

విద్యుత్ సౌకర్యం రావడం వల్ల అంగన్‌వాడీలు కేవలం భోజన కేంద్రాలుగా కాకుండా, ఆహ్లాదకరమైన పాఠశాలలుగా మారుతున్నాయి. ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు కావడంతో పిల్లలు హాయిగా చదువుకుంటున్నారు. తాగునీటి మోటార్లు పనిచేయడం వల్ల శుభ్రమైన నీరు అందుతోంది.

## డిజిటల్ అడుగులు

భవిష్యత్తులో ఈ కేంద్రాల్లో విద్యుత్ ఆధారిత విద్యా పరికరాలను(ఆడియో-విజువల్ ఎయిడ్స్) ప్రవేశపెట్టేందుకు ఇది పునాది కానుంది.



## అధికారుల చిత్తశుద్ధి

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ లేని ప్రతి కేంద్రాన్ని గుర్తించి, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఎస్‌ఈ ఉత్తమ్ జాడే అధికారులను ఆదేశించడం విశేషం. పోషకాహార పంపిణీ, గర్భిణీలకు ఆరోగ్య సేవలు వంటివి సజావుగా సాగేందుకు ఈ విద్యుత్ వెలుగులు వెన్నుముకలా నిలుస్తున్నాయి. పునాది బలంగా ఉంటేనే భవనం పటిష్టంగా ఉంటుంది. చిన్నారుల ప్రాథమిక విద్య అందే అంగన్‌వాడీలను ఇలా ఆధునీకరించడం వల్ల వారి విద్యా వికాసానికి గొప్ప ప్రోత్సాహం లభిస్తుంది. ఎన్పీడీసీఎల్ చేస్తున్న ఈ కృషి అభినందనీయం.



# సిబ్బందితో కలిసి రంగులు చల్లుకున్న ఎస్పీ నితిక పంత్



**ప్రజానావ, ఆసిఫాబాద్:** రంగుల పండుగ హోలీని పురస్కరించుకుని కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో వేడుకలు అత్యంత ఉత్సాహంగా, వైభవంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ నితిక పంత్ ముఖ్య అతిథిగా పాల్గొని, పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి రంగులు చల్లుకుంటూ పండుగ జరుపుకున్నారు. ఈ వేడుకలు స్నేహభావం, ఐక్యత సోదరభావాన్ని ప్రతిబింబించాయి. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఒకే కుటుంబ సభ్యులని, నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉండే సిబ్బందికి ఇటువంటి వేడుకలు మానసిక ఉల్లాసాన్ని కలిగించి పరస్పర ఐక్యతను పెంపొందిస్తాయని ఆమె తెలిపారు. హోలీ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త వెలుగును, ఆనందాన్ని నింపాలని ఆమె ఆకాంక్షించారు. ఒకరికొకరు రంగులు పూసుకుంటూ, శుభాకాంక్షలు తెలుపుకుంటూ కార్యాలయ ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు బాలాజీ వర ప్రసాద్, సతీష్, వామన మూర్తి, సత్యనారాయణ, కుమార స్వామి, సంతోష్ కుమార్, శ్రీనివాస్‌తో పాటు జిల్లాలోని ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

